క్లుప్తంగా

నేడు మిథున్‌రెడ్డి జన్మదిన వేడుకలు

చిత్తూరు కార్పొరేషన్: నగరంలో సోమవారం ఎంపీ మిథున్‌రెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు స్థానిక మైదా ఫ్యాక్టరీ వద్ద నున్న సచివాలయంలో కార్పొరేటర్ హరిణిరెడ్డి ఆధ్వర్యంలో హౌసింగ్ కాలనీ వాసులకు ఫ్యాన్లు పంపిణీ చేయనున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు చౌడేశ్వరమ్మగుడి సర్కిల్ వద్ద డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో అన్నదానం చేయనున్నారు. అనంతరం ఎంఎస్ఆర్ సర్కిల్ వద్ద మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ బుల్లెట్‌సురేష్ ఆధ్వర్యంలో అన్నదానం, పాతకోర్టు వద్ద మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ జ్ఞానజగదీష్ ఆధ్వర్యంలో అన్నదానం చేయనున్నారు. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ముఖ్యఅతిథిగా పాల్గొననున్నారు. ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి స్థానిక పీవీకేఎన్ డిగ్రీ ప్రభుత్వ కళాశాల మైదానంలో నియోజకవర్గంలోని ఆటోడ్రైవర్లకు దుస్తులు అందించనున్నారు.

12న మండల సమావేశం

ఐరాల: స్థానిక ఎంపీడీఓ కార్యాలయం సమావేశ మందిరంలో సర్వసభ్య సమావేశం 12వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు ఎంపీపీ మోహన్ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నాగరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల స్థాయి అధికారులు తమ శాఖల అభివృద్ధికి సంబంధించిన నివేదికలతో సమావేశానికి హాజరు కావాలని సూచించారు. జెడ్పీటీసీ, ఎంపీపీలు, సర్పంచులు, ఎంపీటీసీలు, కో–ఆప్షన్ మెంబర్ హాజరు కావాలని కోరారు.

102 మందికి ఉచిత కంటి పరీక్షలు



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

బంగారుపాళెం: స్థానిక ఎన్‌పీసీ నాయుడు పార్కులో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 102 మందికి ఉచిత కంటి పరీక్షలు నిర్వహించినట్లు ఎన్‌పీఎస్ ట్రస్ట్ నిర్వాహకుడు వెంకటేశ్వరచౌదరి తెలిపారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఉచిత కంటి శిబిరంలో తిరుపతి అరవింద్ కంటి ఆస్పత్రి డాక్టర్లు 102 మందికి పరీక్షలు నిర్వహించారు. అందులో 35 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని గుర్తించి తిరుపతికి తరలించినట్లు తెలిపారు. వారికి ఉచితంగా ఆపరేషన్లు నిర్వహించనున్నట్లు తెలిపారు.

నేడు స్పందన

చిత్తూరు రూరల్: నగరంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తహసీల్దార్ మురళీమోహన్ తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు కార్యాలయంలో నిర్వహించే స్పందనలో ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారులకు విన్నవించుకోవచ్చని ఆయన పేర్కొన్నారు.

కార్పొరేషన్ కార్యాలయంలో..

చిత్తూరు అర్బన్: చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు కమిషనర్ అరుణ పేర్కొన్నారు. వార్డు సచివాలయాల్లో మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు ప్రజలు వినతులు అందచేయవచ్చన్నారు. కార్పొరేషన్ కాల్ సెంటర్ 0857–2232745, వాట్సప్ – 98499 07885 కు తెలియజేయవచ్చన్నారు.

పఠనాసక్తి పెంచుకోండి



ఐరాల: విద్యార్థులు కొంత సమయాన్ని గ్రంథాలయానికి కేటాయించి పఠనాసక్తిని పెంపొందించుకోవాలని స్థానిక గ్రంథాలయాధికారి సుజాత అన్నారు. గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. విద్యార్థుల చేత కథల పుస్తకాలు, దినపత్రికలు, దేశ నాయకుల చరిత్రలను చదివించారు. సుజాత మాట్లాడుతూ పుస్తకాలు చదవడం వలన మంచి నడవడిక, మంచి జ్ఞానం, పోటీతత్వం అలవడుతుందని తెలిపారు.

కాణిపాకంలో అద్దాల మండపం వద్ద కలశ పూజ చేస్తున్న వేదపండితులు, ధ్వజస్తంభానికి సంప్రోక్షణ చేస్తున్న ఆలయ అర్చకులు







అద్దాల మండపంలో కొలువు దీరే సిద్ధి, బుద్ధి సమేత వినాయక స్వామికి అభిషేకం చేస్తున్న అర్చకులు

శాస్త్రోక్తం.. సంప్రోక్షణం!

జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో నూతనంగా నిర్మించిన అద్దాల మండపానికి ఆదివారం ప్రారంభోత్సవం చేశారు. అందులో భాగంగా సంప్రోక్షణ పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ప్రధాన ఆలయ ధ్వజస్తంభానికి తొడుగులుగా రాగి కలశాలను అమర్చి సంప్రోక్షణం చేశారు. అద్దాల మండపంపై కొలువుదీరిన వినాయక స్వామి విగ్రహానికి సంప్రోక్షణ పూజలు చేశారు.

– కాణిపాకం (యాదమరి)





అద్దాల మండపంపై వినాయకుని కొలువుదీర్చి, సంప్రోక్షణ చేస్తున్న వేదపండితులు, ధ్వజస్తంభానికి తొడిగే రాగి కలశం ఊరేగింపు

వరసిద్ధుని సేవలో ప్రముఖులు



చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులకు స్వామివారి తీర్థప్రసాదాలు అందిస్తున్న ఆలయ ఈఓ వెంకటేశు



ఐకా రవి, గుత్తికొండ శ్రీనివాస్‌కు స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. సినీ దర్శకుడు రాఘవేంద్రరావు, మాజీ మంత్రి కామినేని శ్రీనివాసరావు, కాణిపాక ప్రధాన ఆలయ పునర్నిర్మాణ దాతలు ఐకా రవి, గుత్తికొండ శ్రీనివాస్, చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు విచ్చేయగా, ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం ఆశీర్వాద మండపంలో వేదపండితులచే ఆశీర్వచనం అందించి స్వామివారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ ఎస్వీ కృష్ణారెడ్డి, సూపరింటెండెంట్ కోదండపాణి, వాసు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ బాబు తదితరులు పాల్గొన్నారు.



సినీ దర్శకుడు కె.రాఘవేంద్రరావుకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఆలయ చైర్మన్, ఈఓ

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



చిన్నికృష్ణుడి వేషధారణలో అలరిస్తున్న విద్యార్థులు

పెనుమూరు(కార్వేటినగరం) : పెనుమూరు మండల కేంద్రంలోని ముత్యాలమ్మ ఆలయం వద్ద కృష్ణాష్టమి వేడుకలను శ్రీకృష్ణ కమిటీ ఆధ్వర్యంలో 5 రోజుల పాటు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం వేకువజామున స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం రాధా, రుక్మిణీ సమేత శ్రీకృష్ణుడి ఉత్సవ మూర్తులను పట్టువస్త్ర, సుగంధ భరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఈ క్రమంలో భాగంగా ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన గోపూజ, హరికథా కాలక్షేపం భక్తులను ఎంతో ఆకట్టుకుంది. అలాగే మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో వేణుగోపాల్ యాదవ్, నరేష్, సుబ్రమణ్యం, మునిరత్నం పలువురు భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వేడుకగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

పాలసముద్రం : మండలంలోని అరుణోదయ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో ఆదివారం హెచ్‌ఎం సుబ్రమణ్యం సమక్షంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు చిన్నికృష్ణుడి వేషధారణలతో నృత్యాలు వేసి అలరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అక్కమ్మ దేవతకు ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న దృశ్యం



పూజలు అందుకుంటున్న అమ్మవారు

గుడిపాల: మండలంలోని రామభద్రాపురంలో గ్రామ దేవత అక్కమ్మతల్లికి కుంభాభిషేకం సందర్భంగా ప్రత్యేక అభిషేక పూజలు చేశారు. 41రోజుల పాటు నిత్యం అమ్మవారికి అభిషేకం, పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పొంగళ్లు, నెయ్యిదీపాలు పెట్టి ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గోళ్ల హరిప్రసాద్, మాజీ సర్పంచ్ అమరేంద్రబాబు, గ్రామస్తులు ఎత్తిరాజులు, వరదరాజులు, సురేంద్రనాయుడు, రఘుపతి, రామచంద్ర, క్రిష్ణమూర్తి, ప్రదీప్, ప్రకాష్, ప్రసాద్‌నాయుడు, వేణుగోపాల్, హరి పాల్గొన్నారు.

సంగీత విద్వాంసులు దక్షిణామూర్తికి సన్మానం



సన్మాన కార్యక్రమంలో దక్షిణామూర్తి

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరంలోని ఓ ప్రైవేటు హోటల్లో ఆదివారం లయన్స్ క్లబ్ చిత్తూర్ గోల్డ్ మోర్స్ ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫ్రంట్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రముఖ సంగీత విద్వాంసులు దక్షిణామూర్తిని సత్కరించారు. దీనికి ముఖ్య అతిథులుగా ఒలింపిక్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఆర్.కె.పురుషోత్తం, డిప్యూటీ క్యాస్ కమిషనర్ జాన్‌విక్టర్, ఆదాయపు పన్నుల శాఖ అధికారి వెంకటేష్ హాజరయ్యారు. వీరు మాట్లాడుతూ, 40 ఏళ్ల సినీ పరిశ్రమలో ప్రముఖ సంగీత విద్వాంసులుగా దక్షిణామూర్తి విశేష సేవలందించారని చెప్పారు. ఈయన్ను లయన్స్ క్లబ్ చిత్తూరు గోల్డ్, మార్స్ ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫ్రంట్ ఆధ్వర్యంలో సత్కరించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జీడీనెల్లూరు ఎంపీడీవో శ్రీదేవి, తహసీల్దార్ ఇన్బనాథ్, పూతలపట్టు ఎంపీడీవో గౌరి, లయన్స్ క్లబ్ ప్రాంతీయ మేనేజర్ మోహన్‌రెడ్డి, రెడ్డెప్ప, ప్రభాకర్, రమణ, వెంకటేష్, మల్లికార్జున ఆచారి, తదితరులు పాల్గొన్నారు.

మూడు దశాబ్దాలనాటి జ్ఞాపకాల వేదిక

తవణంపల్లె: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1989–90లో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం కలసి అలనాటి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. ఆనాడు పాఠశాలలో తాము ఆడుకున్న ఆటలు, పాడిన పాటలు గుర్తుకు తెచ్చుకొని సంతోషం వ్యక్తం చేశారు. పాఠశాలలో విద్యాబుద్ధులు నేర్పించిన గురువులకు పాదాభివందనం చేశారు. హైస్కూల్లో కళావేదిక నిర్మాణానికి తమ వంతు ఆర్థిక సహాయం అందించడంతో హైస్కూల్ హెచ్‌ఎం శ్రీరంజని, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు. పూర్వ విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి అలరింపజేశారు. హైస్కూల్లో సహపంక్తి భోజనాలు చేసి ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటపాటలతో సంతోషంగా గడిపారు.



తవణంపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో సమావేశమైన 1989–90లో పదో తరగతి చదివిన విద్యార్థులు